
సాక్షి
బాపట్ల
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



అంకమ్మ తల్లి ఊరేగింపు

వేమూరు: చావలి గ్రామ దేవత అంకమ్మ తల్లి ఊరేగింపు శుక్రవారం ప్రారంభించారు. విష్ణుమొలకల వెంకటేశ్వర్లు దంపతులు అమ్మ వారికి పూజలు చేసి, చీర అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



కారు దగ్ధం

బాపట్ల: సూర్యలంక సమీపంలో శుక్రవారం రాత్రి కారు అదుపు తప్పి మంటలు వ్యాపించి దగ్ధమైంది. కారులోని అందరూ బయటకు దిగటంతో ప్రమాదం తప్పింది.

న్యూస్‌రీల్

రేపల్లె చిన్నారి గిన్నిస్ రికార్డు



రేపల్లె రూరల్: రేపల్లెకు చెందిన చిన్నారి గిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. రేపల్లె పట్టణం ఐదో వార్డుకు చెందిన ఆలా మోషే–లావణ్యల ద్వితీయ కుమార్తె అమూల్య ఇటీవల విజయవాడలో జరిగిన గిన్నిస్ రికార్డ్స్ సాధన సమ్మేళనంలో పాల్గొని ప్రతిభ చాటింది. మ్యూజికల్ కీబోర్డ్ ఇన్‌స్ట్రుమెంట్‌లో ప్రతిభ చాటి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరును సాధించింది. పట్టణంలోని నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి అమూల్యకు పట్టణంలోని ప్రముఖులు, ప్రజాసంఘాలు అభినందనలు తెలిపాయి.

నేడు వేట నిషేధ కాలభృతి పంపిణీ

బాపట్ల: మత్స్యకారులకు వేట నిషేధకాల భృతి పంపిణీ కార్యక్రమం శనివారం నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్యకారుల వేట నిషేధ కాల భృతి 12,671మందికి రూ.25.34లక్షలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో 7,304 మందికి, బాపట్లలో 1441 మందికి, చీరాలలో 2,836 మందికి, పర్చూరులో 1090 మందికి రూ.20 వేల వంతున పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

వీర్ల అంకమ్మ కొలుపుల తిరునాళ్ల ప్రారంభం



దాచేపల్లి: వీర్ల అంకమ్మ కొలుపుల తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బొడ్రాయికి జలాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొక్కులు తీర్చుకున్నారు.

28న మాచర్ల వైస్ చైర్మన్ ఎన్నిక

మాచర్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 28న కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఈ ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉండి, తాత్కాలిక చైర్మన్‌గా పని చేసిన మాచర్ల ఏసోబు తన పదవికి మూడు నెలల క్రితం రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కూటమికి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 16 మంది టీడీపీలో చేరారు. మైనార్టీ నాయకుడు షేక్ మదార్ సాహెబ్‌కు అవకాశం ఇచ్చేందుకు కూటమి రంగం సిద్ధం చేసింది. మరో ఇద్దరు కౌన్సిలర్లు తాజాగా టీడీపీలో చేరారు.

గుండ్లకమ్మ వాగులో పడి బాలిక మృతి



నూజెండ్ల: ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ వాగులో జారి పడి బాలిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చీకటి విజయరాజు, కృపావరం దంపతుల సంతానం కీర్తి (10)నాలుగో తరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావటంతో సమీపంలోని గుండ్లకమ్మ నది వద్దకు ఆడుకుంటూ వెళ్లింది. వాగులో జారిపడి కాళ్లు పూడికలో కూరుకుపోవడంతో మృతి చెంది ఉంటుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన స్థానికులు గుర్తించఇ బంధువులకు సమాచారం అందించారు.

ఏఎన్‌ఎస్ సిబ్బందికి సామగ్రి అందజేత

నరసరావుపేట: యాంటీ నక్సల్స్ స్క్వాడ్ (ఏఎన్‌ఎస్)లో పనిచేస్తున్న సిబ్బందికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బ్యాగులు, వాటర్ బాటిల్స్, టోపీలు అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, వీఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఏఎన్‌ఎస్ ఆర్ఐ యువరాజు పాల్గొన్నారు.

వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో వరదలు, తుఫాన్‌లు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. తుఫాన్‌లు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో దక్షిణ, పశ్చిమ రుతు పవనాలు వీస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రహదారులు, విద్యుత్ సౌకర్యం వెంటనే పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. మత్స్యకార గ్రామాలలో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, పూర్తిగా మంచం మీద ఉన్న వారిని గుర్తించాలని అన్నారు. తుఫాన్ షెల్టర్లకు మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. కరకట్టకు గండ్లు పడే ప్రాంతాలను గుర్తించి అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు తయారుచేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసనాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధికి చర్యలు తీసుకోవాలి

పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 3.39 లక్షల మంది పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారన్నారు. వారి ఆర్థిక స్థితిగతులు మార్చాలన్నారు. ఇందుకోసం 59,812 మంది మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్నారు. ఆయా పథకాల ద్వారా రాయితీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. ఆర్థికంగా ఎదగాలనే ఆసక్తి ఉన్న మహిళా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకతతో జరగాలన్నారు. 16 శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, కమిటీలోని సభ్యులైన అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించండి

బాపట్ల: జిల్లాలోని గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్క రించడానికి ప్రభుత్వం ప్రతి 4వ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాపట్ల మండలం వెదుళ్లపల్లి, స్టువర్టుపురం ప్రాంతాలలో లో ఓల్టేజ్ సమస్య వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయని సమస్యను పరిష్క రించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ విద్యుత్ శాఖ అధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. బాపట్ల మండలం అడవి పంచాయతీ యానాది కాలనీలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య పరిష్కరించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. చీరాల మండలం బుర్లవారి పాలెం వద్ద సిమెంట్ కల్వర్ట్ నిర్మించాలని ప్రజలు కోరారు. ఈ విషయం పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజన ప్రజలకు అవసరమైన గృహాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివలీల, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కలెక్టర్‌గా వెంకటమురళి ఎంపిక

మే 8 గవర్నర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం

బాపట్ల: బాపట్ల రెడ్‌క్రాస్ సంస్థకు ఎక్కువ శాతం సభ్యత్వాలు సేకరించినందుకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నారు. బాపట్ల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుల సహకారంతో రూ.16 లక్షల సభ్యత్వాలు, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు సేకరించి రూ.2 లక్షల రెడ్‌క్రాస్ సంస్థకు అందజేశారు. జిల్లా కలెక్టర్ చేసిన సేవలను గుర్తించి గవర్నర్ మే 8వ తేదీన ఉత్తమ కలెక్టర్‌గా అవార్డును ప్రదానం చేసేందుకు ఎంపిక అయినట్లు గవర్నర్ కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ సమాచారం వచ్చింది.



కలెక్టర్ జె.వెంకట మురళిని అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణభట్టు

ఉత్తమ కలెక్టర్‌గా ఎంపికైనందుకు కలెక్టర్ వెంకట మురళిని జిల్లా అధికారులు అభినందించారు. జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణభట్టు సహకారంతో చేయగలిగామని కలెక్టర్ చెప్పారు. రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ భట్టు అభినందనలు తెలిపారు.

ప్రజల సహకారంతోనే మలేరియా దూరం



ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎం.గోపినాథ్, సిబ్బంది

డీఎంఓ డాక్టర్ ఎం.గోపినాథ్

బాపట్ల: మలేరియా అంతం మన చేతుల్లోనే ఉందంటూ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాపట్లలో ప్రదర్శన చేపట్టారు. డాక్టర్ ఎం.గోపీనాథ్ మాట్లాడుతూ మలేరియా వ్యాధిని అంతం చేసేందుకు వనరులు చేకూర్చుకొని, ప్రజలు ఉత్తేజం పొంది, ప్రజల ఆలోచనలో ప్రవర్తనలో మార్పు వస్తేనే మలేరియా వ్యాధిని అంతం చేయవచ్చని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ జబ్బును సమాజం నుండి లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దోమల అంతం–మన పంతం, పరిసరాల పరిశుభ్రత, చిన్న దోమ పెద్ద ప్రమాదం, దోమకాటుకు రక్షణగా దోమతెరలు వాడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక వైద్యాధికారులు కళ్యాణ్, త్రివేణి, మౌనిక, జె రాంబాబు, సుధారాణి, ఎస్.కె.జిలాని, కె.సత్యం రాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సెలవులకు సెలవ్!

- విద్యార్థులపై చదువుల ఒత్తిడి
- వేసవి సెలవులకు ఎగనామం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల ఇష్టారాజ్యం
- టెన్త్ ప్యాసైన విద్యార్థులకు జూనియర్ ఇంటర్ తరగతుల నిర్వహణ
- జూనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సీనియర్ ఇంటర్ తరగతులు
- వేసవి ఎండల తీవ్రతతో క్లాస్ రూముల్లో అల్లాడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు అవలంబిస్తున్న విధానాలకు విద్యార్థులు బలవుతున్నారు. విద్యా సంవత్సరం పొడవునా తరగతి గదులకే పరిమితమవుతున్నారు. వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులు సైతం ఇవ్వకుండా యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తున్నారు. పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులను సైతం వదలడం లేదు. వేసవి సెలవుల అనంతరం నిర్వహించాల్సిన తరగతులను ఇప్పుడే ప్రారంభించేసి విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం సీనియర్, జూనియర్ ఇంటర్ తరగతులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మార్చిలో పరీక్షలు రాసిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు సీనియర్ ఇంటర్ తరగతులను ప్రారంభించేశారు. టెన్త్ ప్యాసైన విద్యార్థులను అప్పుడే కళాశాలల్లో చేర్చుకోవడం మొదలు జూనియర్ ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించేశాయి.

తీవ్ర ఆందోళనలో విద్యార్థులు

ఏడాది పొడవునా మార్కులు, ర్యాంకుల పేరుతో సెలవుల ఊసే లేకుండా కళాశాలకే పరిమితమైన విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వడం లేదు. రెగ్యులర్‌గా తరగతులను నిర్వహించడం ద్వారా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు జేఈఈ అడ్వాన్స్‌డ్, ఏపీ ఈఏపీసెట్, తదితర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు తరగతులు నిర్వహిస్తున్నారు. బైపీసీ విద్యార్థులను నీట్‌కు సన్నద్ధం చేస్తూ జూనియర్, సీనియర్ ఇంటర్ తరగతులను సైతం నిర్వహిస్తున్నాయి. అకడమిక్ కేలండర్ ప్రకారం 2025–26 విద్యాసంవత్సరానికి జూన్ ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన తరగతులను వేసవి సెలవుల్లోనే నిర్వహించేస్తున్నాయి. వేసవిలో తీవ్రమైన ఎండల నడుమ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా తరగతుల నిర్వహణతో విద్యార్థులు అల్లాడుతున్నారు. జైళ్లలో ఖైదీలుగా మగ్గుతున్నారు.

సప్లిమెంటరీ పరీక్షల పేరుతో తరగతుల నిర్వహణ

ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మే 12 నుంచి 20 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలో పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ ఉత్తర్వులను ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల తరగతుల పేరుతో మిగిలిన విద్యార్థులకు సైతం రెగ్యులర్ గా తరగతులను నిర్వహిస్తున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు మినహా మిగిలిన వారికి సెలవులు నిర్వహించేందుకు వీల్లేదని బోర్డు ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు సెలవులుగా పరిగణించాల్సి ఉందని ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐవో జీకే జుబేర్ స్పష్టం చేశారు. సప్లిమెంటరీకి హాజరయ్యే విద్యార్థులు మినహా మిగిలిన వారికి రెగ్యులర్ తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, ఆ విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే బాదుడే

- కొత్త వాహన చట్టం
- నిబంధనల అమలుకు పోలీసులు చర్యలు

వేటపాలెం: హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా...వాహన ధ్రువపత్రాలు చూపించకపోయినా... మైనర్లు వాహనాలు నడిపినా..మైనర్లకు వాహనాలు ఇచ్చినా రూ.వేలల్లో జరిమానాలు కట్టాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టంలోని నిబంధనలు. గతేడాది జూన్ నుంచే చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది.

పిల్లలకు బైక్ ఇస్తే పెద్దలదే బాధ్యత

చాలామంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. అయితే అది ఇకపై చెల్లదు. మైనర్ బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారిపై కేసు నమోదు చేస్తారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం బెయిల్ వచ్చే అవకాశం కూడా లేదు. పదేళ్లపాటు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

జరిమానాలు ఇలా...

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేలు (గతంలో రూ.500), రెడ్‌లైట్‌ను ఉల్లఘించి వాహన నడిపితే రూ.500, రాంగ్ రూట్‌లో నడిపతే రూ.5 వేలు, అతివేగంగా వాహనం నడిపితే రూ.1000, మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు (గతంలో రూ.2 వేలు), ర్యాష్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కారు నడిపితే రూ.1000 జరిమానా విధిస్తారు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే రూ.1000 జరిమానా, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు. అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10 వేలు, ద్విచక్ర వాహనాల్లో ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ. 2 వేలు, ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.2 వేలు జరిమానా విధిస్తారు.

నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతన్నాయి. ప్రతి ఒక్కరూ మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– శేషగిరిరావు, సీఐ, చీరాల రూరల్

అవగాహన కల్పిస్తున్నాం

కొత్త మోటార్ వాహన చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చీరాల–వేటపాలెం ప్రధాన, జాతీయ రహదారులపై ఉదయం, సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఐ, వేటపాలెం

దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం

- గుంటూరు జిల్లాలో 5.86 శాతం నమోదు
- దూరవిద్య టెన్త్ పరీక్షలు రాసిన 939 మంది
- అభ్యర్థుల్లో ఉత్తీర్ణులైన వారు కేవలం 55 మంది
- ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత
- కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో అందని పాఠ్య పుస్తకాలు
- పంపిణీలో తీవ్ర జాప్యంతో తప్పిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్ : వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారి కోసం ప్రవేశపెట్టిన దూర విద్యా విధానం సుదూరంగా పోతోంది. సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రవేశపెట్టిన దూర విద్య లక్ష్యానికి చేరలేక పోతోంది. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా టెన్త్, ఇంటర్‌లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించి, వారికి చదువుకునే అవకాశాలను కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. బుధవారం రెగ్యులర్ టెన్త్ ఫలితాలతో పాటు ప్రకటించిన దూరవిద్య టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లాలో దారుణమైన ఫలితాలు నమోదయ్యాయి.

ఫలితాల్లో చతికిలపడిన జిల్లా

రెగ్యులర్ టెన్త్ ఫలితాల్లో 88.53 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా దూరవిద్య టెన్త్ ఫలితాల్లో చతికిలపడింది. 5.86 శాతం ఉత్తీర్ణతతో జిల్లా సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. పరీక్షలు రాసిన 939 మంది అభ్యర్థుల్లో కేవలం 55 మందే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఇంతటి దారుణమైన ఫలితాలు నమోదు కావడం ఇదే మొదటిసారి. రాష్ట్రస్థాయిలో దూరవిద్య టెన్త్ ఫలితాల్లో 37.93 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, జిల్లాలో పడిపోయింది.



పాత బస్టాండ్ సెంటర్లోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం

సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత

దూరవిద్య టెన్త్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పడిపోవడం వెనుక ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకమే కారణంగా కనిపిస్తోంది. కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంలో విఫలమైన అధికారులు, ఉత్తీర్ణతా శాతం దిగజారిపోవడానికి కారకులుగా నిలిచారు. రాష్ట్రంలోని నాలుగైదు జిల్లాలు మినహా, మిగిలిన 20 జిల్లాల్లోనూ ఉత్తీర్ణతా గణనీయంగా పడిపోయింది.

సకాలంలో అందని మెటీరియల్

గుంటూరు కేంద్రంగా ఉన్న ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరిన అభ్యర్థులకు సకాలంలో మెటీరియల్ అందలేదు. 2024–25 విద్యా సంవత్సరంలో గతేడాది డిసెంబర్ నెలాఖరుకు సైతం పాఠ్య పుస్తకాలు అందలేదు. ఒకవైపు మార్చిలో జరగనున్న పరీక్షలకు ఫీజులు వసూలు చేసిన ఓపెన్ స్కూల్ సొసైటీ తాపీగా పోస్టాఫీసులకు మెటీరియల్ పంపి, చేతులు దులుపుకుంది. గతేడాది డిసెంబరులో గుంటూరు చంద్రమౌళీ నగర్‌లోని పోస్టాఫీసులో జిల్లాలకు పంపేందుకు గుట్టలుగా పడవేసిన మెటీరియల్ పార్శిళ్లు వెలుగు చూశాయి. గతంలో దూరవిద్య టెన్త్, ఇంటర్లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు అక్కడికక్కడే పాఠ్య పుస్తకాలు అందజేసే విధానాన్ని అధికారులు రద్దు చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా పుస్తకాలు పంపే విధానాన్ని ప్రవేశపెట్టడంతో పంపిణీలో నెలకొన్న జాప్యంతో అభ్యర్థులకు శాపంగా మారింది.

క్లుప్తంగా

ఆసోది భాగ్యలక్ష్మికి ఉత్తమ నాయకత్వ పురస్కారం



చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా చినగంజాం జెడ్పీటీసీ సభ్యురాలు ఆసోది భాగ్యలక్ష్మికి ఉత్తమ నాయకత్వ పురస్కారం అందజేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.

జంట హత్యల కేసులో 27 మంది బైండోవర్

బల్లికురవ: జంట హత్యలకు సంబంధించి మండలంలోని వేమవరం గ్రామంలో ఇరువర్గాలకు సంబంధించి 27 మందిని ముందు జాగ్రత్తగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వై.నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. శాంతిభద్రతల దృష్ట్యా మండలంలో 20 సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై నిఘా ఉంటుందని తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతుంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు, అలజడులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

చెరువులో జారిపడ్డ బాలుడు



అద్దంకిరూరల్: ప్రమాదవశాత్తూ చెరువులోకి బాలుడు జారిపడ్డ సంఘటన శుక్రవారం మండలంలోని వెంపరాల గ్రామంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.... మండలంలోని వెంపరాల గ్రామంలోని 10 సంవత్సరాల బాలుడు భరత్ గ్రామంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి చెరువులో పడ్డాడు. సమీపంలోని పశువుల కాపరులు చెరువులో మునిగిపోతున్న బాలుడిని బయటకు తీశారు. బాలుడు అపస్మారక స్థితిలో ఉండటంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాలుడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు 108 బల్లికురవ ఈయంటి రామాంజనేయులు తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు శుక్రవారం 698 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 520 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.11,200, గరిష్ట ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,750 పలికింది. కాయలు 178 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.11,200, గరిష్ట ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,750 పలికింది. మొత్తం 523.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు యార్డు కార్యదర్శి తెలిపారు.

చినగంజాం స్టేషన్‌లో సమస్యల కూత

- లక్షలు వెచ్చించి స్టేషన్ ఆధునికీకరణ
- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని రైల్వే అధికారులు

చినగంజాం: కోట్లాది రూపాయలు వెచ్చించి రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించారు..కానీ కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రైల్వే అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకు చినగంజాం రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణకు రైల్వే శాఖ భారీగా నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో చినగంజాం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించారు. అందులో భాగంగా ఆధునిక సౌకర్యాలతో భవనం నిర్మించారు. ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ, సాంకేతిక సౌకర్యాల పెంపు, నూతన ఫ్లైఓవర్, ప్లాట్ ఫారాల పొడిగింపు, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు నిర్మించారు. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం చేసిన తర్వాత కొద్ది రోజులు



లక్షలు వెచ్చించి నిర్మించిన చినగంజాం రైల్వేస్టేషన్

మాత్రమే సౌకర్యాలు కొనసాగించారు. ఆ తర్వాత నుంచి వాటి గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రిజర్వేషన్ సౌకర్యం తొలగింపు

దశాబ్దాలుగా చినగంజాం రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న రిజర్వేషన్ సౌకర్యాన్ని రైల్వే అధికారులు తొలగించారు. స్టేషన్ ఆధునీకరణతో స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు అవుతాయనుకున్న ప్రయాణికులకు నిరాశ ఎదురైంది. మెరుగైన సాంకేతిక వ్యవస్థతో నిర్మాణం చేసినప్పటికీ రిజర్వేషన్ సౌకర్యాన్ని మాత్రం ఎత్తివేశారు. స్థానిక ప్రయాణికులు రిజర్వేషన్ కోసం చీరాల, ఒంగోలు స్టేషన్‌లకు పరిగులెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రయోజనం లేదు



లక్షలు ఖర్చు పెట్టి స్టేషన్ కట్టారు. కానీ ఏం ప్రయోజనం. కొళాయిల్లో చుక్క నీరు రాదు. మరుగుదొడ్లులో సౌకర్యాలు లేవు. మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రైలు దిగి రావాలంటేనే భయమేస్తుంది. రైల్వే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

– రాజు సుబ్బులు, ప్రయాణికురాలు, చినగంజాం

మరుగుదొడ్లలో సౌకర్యాలు మృగ్యం



అపరిశుభ్రంగా ఉన్న మరుగు దొడ్లు

స్టేషన్‌లో సాధారణ ప్రయాణికుల కోసం రెండు మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ఒక మరుగుదొడ్డి నిర్మించారు. వాటిలో కనీసం నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇటీవల ఒక ఇంజిన్ డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు అత్యవసరంగా తన రైలును చినగంజాం స్టేషన్‌లో ఆపాడు. మరుగుదొడ్డిలోని అపరిశుభ్రత, నీటి సౌకర్యం లేకపోవడం గుర్తించి ఆవేదన చెందాడు.

ప్లాట్‌ఫారాలపై అపరిశుభ్రత



పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ప్లాట్‌ఫారం

చినగంజాం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై అపరిశుభ్రత నెలకొంది. ప్లాట్‌ఫారాలపై ఎక్కడ చూసినా చిల్లచెట్లు, పొడవుగా పెరిగిన పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయంలో ప్రయాణికులు రైలు రాక కోసం ప్లాట్‌ఫారంపై వేచి ఉండాలంటే జంకుతున్నారు. అంతేగాకుండా ప్లాట్ ఫారంపై నిత్యం వాకింగ్ చేసే స్థానికులు సైతం అపరిశుభ్ర వాతావరణం చూసి భయపడుతున్నారు.

దివ్యాంగులకు కష్టాలే..



వీల్ చైర్ రోగులకు అనువుగా లేని రైల్వే ట్రాక్

చినగంజాం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కాలంటే దివ్యాంగులకు చుక్కలు కనిస్తున్నాయి. దివ్యాంగులు, రోగులు వీల్ చైర్‌లో రైలు వద్దకు వెళ్లాలంటే ర్యాంప్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉండగా రైల్వే అధికారులు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో రైలు వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

చుక్క నీరు రాదు



నిరుపయోగంగా ఉన్న తాగునీటి కొళాయిలు

స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా సుమారు 15పైగా కొళాయిలు ఏర్పాటు చేశారు. వాటిలో చుక్క నీరు రాదు. దీంతో కొళాయిలు అలంకారప్రాయంగా మారాయి. దాహంతో గుక్కెడు నీరు తాగుదామంటే అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



మృతుడు లింగయ్య

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందిన సంఘటన మేదరమెట్ల నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని శాంతినగర్ వద్ద శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు మండలంలోని మైలవరం గ్రామానికి చెందిన జే లింగయ్య(30) అద్దంకి పట్టణంలోని ఇనుప కొట్లో రోజు వారీ కూలీగా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ప్రతి రోజూ స్వగ్రామం నుంచి అద్దంకి వచ్చి కూలి పని ముగించుకుని బైకుపై ఇంటికి తిరిగి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో శనివారం బైకుపై అద్దంకి నుంచి స్వగ్రామం వెళ్తుండగా శాంతినగర్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. తలకు తీవ్రగాయాలైన లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త మరణ వార్త తెలుసుకున్న భార్య భోరున విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళ మెడలో బంగారు నగలు అపహరణ

చీరాల: ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో నుంచి బంగారు నగలను గుర్తుతెలియని దుండగులు తెంచుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని మేడా వారి వీధిలో శేషారత్నం అనే మహిళ గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని సుమారు 13 సవర్ల బంగారు నల్లపూసలు, తాళిబొట్టు తాడును తెంచుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై మహిళ ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎస్.సుబ్బారావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి బాధితురాలి వద్ద నుంచి వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేకల బిజిలిబాబు



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి మేకల బిజిలిబాబు

బాపట్ల: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు తిరుపతి నగరంలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేకల బిజిలిబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు తన్నీరు సింగరకొండ తెలిపారు. బాపట్ల జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మేకల బిజిలిబాబు మాట్లాడుతూ అఖిల భారత యువజన సమాఖ్య 1959 మే 3న ఆవిర్భవించినట్లు తెలిపారు. నాటి నుండి నేటి వరకు దేశంలో యువతి, యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై అవినీతి అంతం ఏఐవైఎఫ్ పంతంగా ప్రతిజ్ఞ చేసి ఎన్నో వీరోచిత పోరాటాలు చేసిందన్నారు. భగత్ సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టును అమలు చేయాలని, ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న అన్నీ పోస్టులు భర్తీ చేయాలని, దేశవ్యాప్తంగా ప్రవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2020 నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని యువజన హక్కుల కోసం యువత మార్పు నినాదంతో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. మహాసభలలో యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ బాపట్ల నియోజకవర్గ కార్యదర్శి పొట్లూరి ఏసేబు, ఇల్లా ఏసుబాబు, ఉదయరాజు, శ్రీహరి తదితరులున్నారు.

యార్డులో 1,08,662 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,336 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,08,662 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 44,778 బస్తాలు నిల్వ ఉన్నాయి.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం



నీటిపై తేలియాడుతున్న గుర్తు తెలియని మృతదేహం

కర్లపాలెం: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం మండల పరిధిలోని పేరలి కొత్తపాలెం సమీపంలో గుడిగుంట చెరువులో పడి ఉన్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని సమ్మెటవారిపాలెం పంచాయతీ పేరలి కొత్తపాలెం సమీపంలోని గుడిగుంట చెరువులో సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుని మృతదేహం లభ్యమైందని తెలిపారు. స్థానిక వీఆర్వో ఎస్‌కె సాహిదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. వృద్ధుడు మృతిచెంది సుమారుగా మూడు రోజులై ఉంటుందని అతని వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్ 9440900870కు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

అద్దంకిలో ఖర్జూరం సాగు

అద్దంకి: జిల్లాలో ఖర్జూరం సాగును రైతులు చేపట్టారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, చిన్న కొత్తపల్లి గ్రామాల్లో మొత్తం ఐదు ఎకరాల్లో ఖర్జూర పంటను రైతులు సాగు చేశారు. ఈ తోటలు ప్రస్తుతం నాలుగు సంవత్సరాల వయసులో ఉన్నాయి. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో ఉప్పుటూరి చిరంజీవి అనే రైతు రెండు ఎకరాల్లో బరిహీ రకం ఖర్జూరం పంటను, తమిళనాడుకు చెందిన నిజాముద్దీన్ దగ్గర మొక్కను రూ.4500 చొప్పున కొనుగోలు చేసి తెచ్చి సాగు చేశాడు. ఈ తోట నాలుగు సంవత్సరాల వయసులో ఉంది. ఎండలు బాగా కాచి వాతావరణం అనుకూలంగా ఉంటే నాటిన మూడో సంవత్సరం నుంచే కాపుకు వస్తాయి. చెట్టుకు మొదటి సంవత్సరం 20 కిలోలు, రెండో సంవత్సరం 50, మూడో సంవత్సరం 100, అక్కడ నుంచి 300 కిలోల నుంచి 500 కిలోల వంతున 40 సంవత్సరాలపాటు దిగుబడిని ఇస్తాయి. కిలో ధర రూ.150 నుంచి 200 వరకు పలుకుతుంది. ఎకరాకు మొదటి సంవత్సరం రూ.75 వేలు ఆదాయం వస్తుంది.



తిమ్మాయపాలెంలో సాగు చేసిన ఖర్జూర తోట

వ్యయంతో కూడుకున్న పంట..



ఖర్జూర పంట సాగు అత్యధిక వ్యయంతో కూడుకుంది. మొక్క ధరే అధికంగా ఉంటుంది. పూతకు వచ్చిన తరువాత మగ మొక్కల నుంచి పొప్పొడి సేకరించి దాచి ఆడ మొక్కలు పూతపైన చల్లాల్సి ఉంటుంది. ఈ పనంతా చేసుకోగలిగి, ఎండలు బాగా కాచే ప్రాంతాల్లో నాటుకోవచ్చు. –ఉప్పుటూరి చిరంజీవి, రైతు

ఆద్యంతం నవరసభరితం



జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభిస్తున్న ఎ.వి.బాబురావు శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

మార్టూరులో రెండవ రోజు అలరించిన పరిషత్తు నాటికలు

మార్టూరు : మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మూడు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ప్రదర్శనకు ముందు రిలయన్స్ ఫౌండేషన్ ప్రకాశం జిల్లా చైర్మన్ ఏ.వి.బాబూరావు శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. 'వేదిక' సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ప్రదర్శనలలో పాల్గొన్న నటీనటులకు జ్ఞాపికలు అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన మీనాక్షి సేతురామన్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.వి.సేతురామన్, వసంత సేతురామన్ దంపతులు కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనూరాధ, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, గరివిడి శ్రీనివాసరావు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మనిషిలోని అంతర్లీన కోణాలను స్పృశించిన '(అ)సత్యం'

స్వార్థమైనా, నిస్వార్థమైనా, మంచి అయినా, చెడు అయినా, దైవత్వం అయిన, రాక్షసత్వం అయినా ఏదైనా సరే మనిషి హృదయానికి పరిమితమై ఉంటుంది. ప్రతి సత్యం వెనుక లేక అసత్యం వెనుక మనిషి స్వార్థం లేక భయం నిక్షిప్తమై ఉంటుంది. కంటికి కనిపించేదంతా సత్యం కాదు అలాగని కనిపించనిదంతా అసత్యం కూడా కాదు. యదార్థం అయినా సరే ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం. అబద్ధమైనా సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం. ఏది సత్యం? ఏది అసత్యం? అంటూ ప్రేక్షకులను ఆలోచింపజేసిన నాటిక శ్రీ చైతన్య కళా ప్ర వంతి ఉక్కునగరం విశాఖ వారి '(అ)సత్యం 'నాటిక. ఎం శ్రీ సుధ రచించిన ఈ నాటికకు బి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు.

రక్తి కట్టించిన 'జనరల్ బోగీలు'

రైలు ప్రయాణం అందరికీ ఇష్టమైనది, సౌకర్యవంతమైనది. అయితే సామాన్యుడి నుంచి సగటు మధ్యతరగతి ప్రజల వరకు రైలులో జనరల్ బోగీలలో తక్కువ ఖర్చు కారణంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా జనరల్ బోగీలను పెంచాల్సిన రైల్వే శాఖ క్రమేపీ బోగీలను తగ్గిస్తూ ఉండటంతో రైలులోని బాత్‌రూములు, మరుగుదొడ్లలో సైతం ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ప్రస్తుతం మనం చూస్తున్నాం. తరచూ సంభవించే రైలు ప్రమాదాలలో జనరల్ బోగీలో ప్రయాణించే ప్రయాణికులు మరణించిన సందర్భాలలో వారి చిరునామాలు రైల్వే శాఖ వద్ద ఉండని విషయం కూడా అందరికీ తెలిసిందే. అలాంటి ప్రమాదంలో తన కొడుకును దూరం చేసుకున్న ఓ తల్లి సావిత్రమ్మ రైల్వే శాఖతోపాటు ప్రజాప్రతినిధులకు ఉత్తరాల ఉద్యమం ప్రారంభించి సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపిందన్న ఇతి వృత్తంతో సాగిన నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించిన' జనరల్ బోగీలు'. పి.టి.మాధవ్ రచించిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికలో సావిత్రమ్మ పాత్రధారిగా నటించిన సీనియర్ నటి సురభి ప్రభావతి తన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

మహిళల మనోగతాలకు దర్పణం పట్టిన 'ఋతువు లేని కాలం'

స్వేచ్ఛ పేరిట ఉమ్మడి కుటుంబ వ్యవస్థలను, పురుషాధిక్యతా శృంఖలాలను తెంచుకుంటున్నామంటూ తమకు తామే బానిసలుగా మారుతున్న నేటి మహిళల పోకడను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారి 'ఋతువులేని కాలం'. అపరిమితమైన ఆర్థిక స్వేచ్ఛతో ఆడంబరాలకు, ఫ్యాషన్లకు బానిసలౌతూ సంస్కృతీ సాంప్రదాయాలకు వక్ర భాష్యం చెప్పడం, మేము అనే భావన నుండి నేను మాత్రమే అనే భావన పెరుగుతూ ఒంటరితనానికి దగ్గరవుతున్న మహిళల అంతరంగాలను ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ప్రదర్శించారు నాటికలోని నటీనటులు.

చంద్రబాబు పాపం - విద్యార్థుల పాలిట శాపం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి వల్ల గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలు దిగజారాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవార ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పోలిస్తే ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గిందని ఆరోపించారు. నాడు విద్యా సంస్కరణలతో పాటు అమ్మఒడి వంటి అనేక పథకాలతో జగనన్న అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని తెలిపారు. నేడు ఆయా పథకాలన్నీ అటకెక్కించి పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారని ఆరోపించారు. 2024లో మొత్తం 2,800 పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. 2025లో అది 1,680 పాఠశాలలకు పడిపోయిందని తెలిపారు. గతంతో పోలిస్తే 5.5 శాతం తక్కువ ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంపై కక్ష, యూపీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల తొలగింపు వంటి అస్తవ్యస్తమైన నిర్ణయాల వలనే ఫలితాలు దారుణంగా దెబ్బ తిన్నాయని తెలిపారు. మరోవైపు గతేడాది సెప్టెంబర్ వరకు టీచర్ల సర్దుబాటు చర్యలతోనే విద్యా సంవత్సరంలో విలువైన సమయమంతా వృథా అయిపోయి ఫలితాలు అడుగంటాయని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
- నరసరావుపేట, పోస్టల్‌కాలనీ నందు VIP హోమ్స్‌తో 3BHK ఫ్లాట్ అమ్మబడును. 1570 Sq Yards,సెమీఫినిష్,(సీలింగ్GST పేమెంట్ కంప్లీట్) ఈస్ట్‌ఫేస్, Cont: 9398498296

HOUSE FOR SALE
- తెనాలి దగ్గర అంగలకుదురు గ్రామంలో 80అ॥ రోడ్ గల 113చ॥గ॥ ఇల్లు అమ్మకం కలదు. అద్దెకు కూడా ఇవ్వబడును. లోన్ సౌకర్యం కలదు. ఆసక్తి గల వారు సంప్ర॥ 9704899997

SERVICES

BUSINESS OFFER
- ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు– Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393937

CHANGE OF NAME
- I.TELEDEVARAPALLI SHYAMSUNDARA SASTRY (Old Name), S/o. Laxmi Prasada Rao Teledevarapali, Resident of Door No: 1-89, Kothapeta, Mangalagiri town, Guntur Dist A.P - 522503. I have Indian Passport Bearing No. K 9468968. I have changed my name from TELEDEVARAPALLI SHYAMSUNDARA SASTRY (Old Name) S/o.Laxmi Prasada Rao Teledevarapalli to TELEDEVARA PALLI SYAMA SUNDARA SASTRY S/o Teledevarapalli Lakshmi Prasada Rao (New name). Here after my name is known as TELIDEVARAPALLI SYAMA SUNDARA SASTRY S/o.Telidevarapalli LakshmiPrasadaRao (New. name)

GOLD FINANCE
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED
- తాడేపల్లి - మంగళగిరి పరిసర ప్రాంతాలలో 12గంటలు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8959576707
- హాస్పటల్ ఎక్విప్‌మెంట్ సప్లయింగ్ ఆఫీస్ నందు పనిచేయుటకు సర్వీస్ 4 డెలివరీ యువకులు కావలెను. విద్యార్హత: 10th to Inter, Age: 19 to 26. Contact: 9705969421
- మంగళగిరిలోని విజయ్ హోమ్‌పుడ్స్ నందు మార్కెటింగ్ చేయుటకు యువతీ/యువకులు కావలెను. మంచి జీతం+ ఉచిత వసతి+భోజనం 7382712318
- తెనాలి బాపట్ల చీరాల రేపల్లె నరసరావుపేట సత్తెనపల్లి మా బ్రాంచ్ ఆఫీసులలో పని చేయుటకు స్త్రీలు కావలెను. అర్హత: 7th-PG, Salary: 18000-25000.Call:9030740757
- వేదం ఓల్డ్ ఏజ్ హోమ్ నందు వృద్ధులకు సేవ చేయుటకు వర్కర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 7780791297, 9642791297
- తెనాలి ఆటోనగర్ సోనాలిక ట్రాక్టర్ షోరూం నందు పనిచేయుటకు పొన్నూరు, పిట్టలవానిపాలెం, బాపట్ల కర్లపాలెం, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె, భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు, చుండూరు ఏరియాలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (లోకల్ వారికి) కావలెను. ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Q: డిగ్రీ, మంచి జీతం కలదు ✆ 7729991100 / 8790841206
- ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు M/F కావలెను. Qul: 10th - డిగ్రీ. మంచిజీతం, ఉచిత రూము, భోజనం సదుపాయం. వర్క్ ఫ్రం హోం అవకాశం. 80888 47541
- Wanted Teachers (KG to X) Wanted Experienced Teachers for a Reputed English Medium School in GNT ✆ 9447660603
- Wanted Female Tele Callers, Q: Any Degree (Salary: 15k) No Age Limit, Vaidya Education Services. ✆ 8790115559, 7416790367
- JB ఇంగ్లీష్ మీడియం స్కూల్- బాపట్ల నందు పనిచేయుటకు హెడ్ మాస్టర్, అన్ని సబ్జెక్టుల టీచర్లు, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మరియు PRO లు కావలెను. సంప్ర॥ రైలుపేట, 4వ లైను, పటేల్‌నగర్, 1వ లైను, బాపట్ల. ✆ 9949843944, 9441649539
- గుంటూరు అరండల్‌పేట నందు గల ప్రముఖ యాడ్ ఏజెన్సీలో ఫొటోషాప్, కోరల్‌డ్రా నందు 2 సం॥ అనుభవం గల గ్రాఫిక్ డిజైనర్స్ కావలెను. జీ: 30వేలు, ఉ॥10 - 8.30సా॥ల వరకు 7702834555
- మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.